దరఖాస్తుదారులకు న్యాయం చేస్తాం



డీసీకి దరఖాస్తు దారుల సమస్యలు వివరిస్తున్న టీఆర్‌టీ కాలనీ వాసులు

సికింద్రాబాద్: ఆరుగ్యారంటీ పథకాల కోసం దరఖాస్తు చేసుకున్న వారందరికీ న్యాయం చేసేందుకు సహకరిస్తామని సికింద్రాబాద్ సర్కిల్ డిప్యూటీ కమిషనర్ సుభాష్‌రావు చెప్పారు. గురువారం సీతాఫల్‌మండి డివిజన్ టీఆర్‌టీ కాలనీ ప్రాంతంలో పర్యటించిన డిప్యూటీ కమిషనర్ స్థానిక కార్పొరేటర్ సామల హేమ, అసిస్టెంట్ మున్సిపల్ కమిషనర్ సంధ్యతో కలిసి హరితహారం కార్యక్రమం నిర్వహించారు. ఈ సందర్భంగా పలువురు టీఆర్‌టీ కాలనీ వాసులు డీసీని కలిసి ఆరు గ్యారంటీ పథకాల కోసం దరఖాస్తు చేసుకున్న వారందరి పేర్లు ఆన్‌లైన్‌లో సమోదు కాలేదన్నారు. ఇంకొందరు దరఖాస్తు దారులు తమకు అవసరమైన ప్రభుత్వ పథకం బాక్సులో టిక్ చేయని కారణంగా సదరు దరఖాస్తును పెండింగ్‌లో ఉంచినట్టు తెలిపారు. అటువంటి దరఖాస్తు దారులందరికీ న్యాయం చేయాలని కోరారు. ఇందుకు స్పందించిన డీసీ సుభాష్‌రావు తమ కార్యాలయంలో పెండింగ్‌లో ఉన్న దరఖాస్తులను మరోమారు పరిశీలిస్తామన్నారు. అర్హులైన అబ్దిదారులందరికీ ప్రభుత్వ సంక్షేమ పథకాలు అందేలా కృషి చేస్తామని హామీ ఇచ్చారు. ఈ కార్యక్రమంలో టీఆర్‌టీ కాలనీ సంక్షేమ సంఘం ప్రతినిధులు చంద్రశేఖర్, రాజేశ్‌సింగ్, అశ్విన్‌కుమార్, సంజయ్‌సింగ్ తదితరులు పాల్గొన్నారు.

కల్యాణలక్ష్మి పథకాన్ని సద్వినియోగం చేసుకోవాలి



చెక్కులను అందజేస్తున్న ఎమ్మెల్యే తలసాని శ్రీనివాస్‌యాదవ్

సనత్‌నగర్: పేదింటి ఆడపడుచు పెళ్లికి ప్రభుత్వం అందిస్తున్న ఆర్థిక సహాయాన్ని సద్వినియోగం చేసుకోవాలని మాజీ మంత్రి, సనత్‌నగర్ ఎమ్మెల్యే తలసాని శ్రీనివాస్‌యాదవ్ కోరారు. సనత్‌నగర్ డివిజన్‌కు చెందిన ఆరుగురు లబ్ధిదారులకు షాదీ ముబారక్ పథకం కింద మంజూరైన ఆర్థిక సహాయం చెక్కులను వెస్ట్‌మారేడ్‌పల్లిలోని తన కార్యాలయంలో గురువారం అందజేశారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే మాట్లాడుతూ ఈ పథకం ద్వారా లబ్ధిపొందిన వారు అర్హులైన వారందరూ వినియోగించుకునే విధంగా చూడాలన్నారు. కార్యక్రమంలో కార్పొరేటర్ కొలను లక్ష్మీబాల్‌రెడ్డి, బీఆర్‌ఎస్ నాయకులు కొలను బాల్‌రెడ్డి, జమీర్ తదితరులు పాల్గొన్నారు.

పరిసరాల పరిశుభ్రత అందరి బాధ్యత



పరిసరాలను శుభ్రం చేస్తున్న డాక్టర్ కాసర్ల వీరు

అడ్డగుట్ట: పరిసరాలను పరిశుభ్రంగా ఉంచుకోవాల్సిన బాధ్యత అందరిపై ఉంటుందని అడ్డగుట్ట ఆరోగ్య కేంద్రం డాక్టర్ కాసర్ల వీరు అన్నారు. స్వచ్ఛదనం – పచ్చదనం కార్యక్రమంలో భాగంగా గురువారం అడ్డగుట్టలోని యూపీహెచ్‌సీలో పరిసరాలను శుభ్రం చేశారు. అనంతరం, ఆరోగ్య కేంద్రం ప్రాంగణంలో మొక్కలు నాటారు. ఈ సందర్భంగా డాక్టర్ వీరు మాట్లాడుతూ పరిసరాల పరిశుభ్రతతో పాటు పర్యావరణ పరిరక్షణ కూడా అందరి బాధ్యత అని పేర్కొన్నారు. కార్యక్రమంలో ఆరోగ్య కేంద్రం సిబ్బంది, ఆశా వర్కర్లు పాల్గొన్నారు.

ఉచిత ఆరోగ్య శిబిరం

బౌద్ధనగర్: స్వచ్ఛదనం పచ్చదనం కార్యక్రమంలో భాగంగా బౌద్ధనగర్‌లోని నూర్ మహ్మదీయ మసీదు వద్ద ఉచిత ఆరోగ్య శిబిరం నిర్వహించారు. ఈ సందర్భంగా ముఖ్యఅతిథిగా హాజరైన కార్పొరేటర్ కంది శైలజ శిబిరాన్ని ప్రారంభించారు. అనంతరం, ఆమె మాట్లాడుతూ ఆరోగ్య కేంద్రం ఆధ్వర్యంలో నిర్వహిస్తున్న ఉచిత వైద్య శిబిరాలను ప్రజలు వినియోగించుకోవాలన్నారు. వర్షాకాలం నేపథ్యంలో సీజనల్ వ్యాధుల పట్ల ప్రజలు అప్రమత్తంగా ఉండాలన్నారు. కార్యక్రమంలో డాక్టర్ ఎలిజమెత్, ఏఎంసీ ఒమర్, శానిటేషన్ జవాన్ రాజు, సూపర్‌వైజర్ చందు, బీఆర్‌ఎస్ నేత సురేష్ తదితరులు పాల్గొన్నారు.

విద్యా ప్రమాణాలు మెరుగుపర్చండి

మంత్రి సీతక్కకు వినతిపత్రం



మంత్రి సీతక్కకు వినతిపత్రం ఇస్తున్న తల్లుల సంఘం, సీఆర్పీఎఫ్ ప్రతినిధులు

అడ్డగుట్ట: దిగజారిన విద్యా ప్రమాణాలను మెరుగుపరిచి, పాఠశాల్లో మౌలిక వసతులు కల్పించే విధంగా చర్యలు తీసుకోవాలని ఎంవీ ఫౌండేషన్, తెలంగాణ తల్లుల సంఘం ప్రతినిధులు విజ్ఞప్తి చేశారు. గురువారం రాష్ట్ర మంత్రి సీతక్క, టీజేఎస్ రాష్ట్ర అధ్యక్షులు కోదండరాం, ఎమ్మెల్యేలు వెంకటస్వామి, కూనంనేని సాంబశివరావు, స్కూల్ ఎడ్యుకేషన్ డైరెక్టర్ నర్సింహారెడ్డిలకు వినతిపత్రాలు సమర్పించారు. ఈ సందర్భంగా ఎంవీ ఫౌండేషన్, తల్లుల సంఘం ప్రతినిధులు మాట్లాడుతూ సంక్షోభంలో ఉన్న విద్యా వ్యవస్థను, జిల్లాల్లో దిగజారిన విద్యా ప్రమాణాలను తెలంగాణ విద్యాశాఖ, ఎస్‌సీఈఆర్‌టీ సంయుక్తంగా మూడవ తరగతి విద్యార్థులకు చేసిన అసెస్మెంట్ నివేదికలో కేవలం 12 శాతం మంది పిల్లలు మాత్రమే రాయడం, చదవడం చేయగలుగుతున్నారన్నారు. వినతిపత్రాలు సమర్పించిన వారిలో తల్లుల సంఘం రాష్ట్ర కన్వీనర్ భాగ్యలక్ష్మి, కార్యదర్శి కొత్త సాయిలక్ష్మి, సీఆర్పీఎఫ్ కార్యదర్శి వెంకటేశ్వరరావు, చింతల లక్ష్మీనారాయణ ఉన్నారు.

బంగ్లాదేశ్‌లో హిందువుల దయనీయ స్థితి



సమావేశంలో మాట్లాడుతున్న వీహెచ్‌పీ జాతీయ అధికార ప్రతినిధి శశిధర్

పంజగుట్ట: బంగ్లాదేశ్‌లో జరుగుతున్న అనిశ్చితి కారణంగా అక్కడి మైనార్టీలు అయిన హిందువులపై హత్యలు, అత్యాచారాలు, దోపిడీలు, దేవాలయాల ధ్వంసాలతో దయనీయంగా మారిందని విశ్వహిందూ పరిషత్ నేతలు ఆవేదన వ్యక్తం చేసింది. భారత ప్రభుత్వం వెంటనే సరైన చర్యలు తీసుకుని అక్కడి హిందువులను కాపాడాలని వారు సూచించారు. గురువారం సోమాజిగూడ ప్రెస్‌క్లబ్‌లో విలేకరుల సమావేశంలో విశ్వహిందూ పరిషత్ రాష్ట్ర అధ్యక్షులు నరసింహ మూర్తి, జాతీయ అధికార ప్రతినిధి శశిధర్, రాష్ట్ర ప్రచార ప్రసార ప్రముఖ్ పగుడాకుల బాలస్వామిలు మాట్లాడుతూ బంగ్లాదేశ్‌లో రిజర్వేషన్ల కోసం ప్రారంభమైన ఉద్యమం, అక్కడి సుప్రీంకోర్టు తీర్పు తరువాత ఉద్యమం కాస్తా యాంటీ ఇండియా, యాంటీ ఇజ్రాయల్‌గా మారిందన్నారు. అక్కడి మౌల్వీలు చిట్టచివరి హిందువును కూడా వదలమంటూ అనడం చూస్తుంటే వారు జీహాదీలుగా తయారయ్యారని అర్ధమౌతుందన్నారు. ఈ క్లిష్టపరిస్థితిని సద్వినియోగం చేసుకుని జిహాదీలు సరిహద్దులు దాటి భారత్‌లోకి చొరబడేందుకు ప్రయత్నం చేసే అవకాశం ఉందని భారత భద్రతాదళం అప్రమత్తంగా ఉండాలన్నారు. ఈ సమావేశంలో భజరంగ్‌దళ్ నాయకుడు సుభాష్ చందర్ పాల్గొన్నారు.

భక్తిశ్రద్ధలతో విగ్రహ ప్రతిష్ఠ

చిలకలగూడ : మెట్టుగూడ డివిజన్ చింతబావిలో నూతనంగా నిర్మించిన ఈదమ్మ దేవాలయంలో గురువారం అమ్మవారి విగ్రహ ప్రతిష్ఠ కార్యక్రమం భక్తిశ్రద్ధలతో నిర్వహించారు. గణపతిపూజ, కంకణధారణ తదితర ఆధ్యాత్మిక కార్యక్రమాలు నిర్వహించారు. మేళతాళాలు, బాజాభజంత్రీలు, వేదపండితుల మంత్రోచ్ఛారణ మధ్య దేవాలయ గర్భగుడిలో అమ్మవారిని ప్రతిష్ఠించారు. మాజీమేయర్, బీజేపీ నాయకులు బండ కార్తీకచంద్రారెడ్డి దంపతులు ముఖ్యఅతిథులుగా హాజరై ప్రత్యేక పూజలు చేపట్టారు.



ఈదమ్మ దేవాలయ విగ్రహ ప్రతిష్ఠలో పాల్గొన్న మాజీమేయర్ బండ కార్తీకచంద్రారెడ్డి దంపతులు

- సిద్ధమైన ఓపెన్ జిమ్‌లు
- త్వరలో ప్రారంభోత్సవాలు
- అందుబాటులోకి 14 జిమ్‌లు
- రూ. 80 లక్షల వ్యయంతో ఏర్పాటు



సీతాఫల్‌మండి టీఆర్‌టీ పార్కులో ప్రారంభోత్సవానికి సిద్ధంగా ఉన్న పిల్లల ఓపెన్ పార్కు

రిమ్..జిమ్.. సికింద్రాబాద్

సికింద్రాబాద్: సికింద్రాబాద్ నియోజకవర్గంలో 14 ఓపెన్ జిమ్‌లు అందుబాటులోకి రానున్నాయి. రూ.80 లక్షల అంచనా వ్యయంతో కొద్ది నెలల క్రితం ప్రతిపాదించిన ఓపెన్ జిమ్ ప్రతిపాదనల కార్యాచరణ తుది దశకు చేరింది. కాలనీలు, బస్తీల్లో అందుబాటులో ఉన్న పార్కు స్థలాల్లో ఓపెన్ జిమ్‌లు ఏర్పాటు చేశారు. స్థలాల లభ్యతను బట్టి డివిజన్‌కు ఒకటి నుంచి నాలుగు జిమ్‌లు ఏర్పాటు చేస్తున్నారు. ప్రతిపాదిత 14 జిమ్‌లలో 11 జిమ్‌ల ఏర్పాటు ప్రక్రియ పూర్తయింది. మరో రెండింటి పనులు తుదిదశకు చేరాయి. నియోజకవర్గంలోని అన్ని ప్రాంతాల ప్రజలకు జిమ్ సేవలు అందుబాటులోకి తేవాలన్న లక్ష్యంతో ఓపెన్ జిమ్‌ల ప్రక్రియకు జీహెచ్‌ఎంసీ అధికారులు శ్రీకారం చుట్టారు. బస్తీలు, కాలనీలు తేడా లేకుండా ఆయా ప్రాంతాల్లో ఖాళీ స్థలాల లభ్యత ఆధారంగా జిమ్‌ల ఏర్పాటు చేస్తున్నారు. కనీసం 5 నుంచి 11వరకు వ్యాయామ పరికరాలను బిగించి ఓపెన్ జిమ్‌లు ఏర్పాటు చేస్తున్నారు. అన్ని పార్కుల్లో ఓపెన్ జిమ్‌లు ఏర్పాటు చేయాలని స్థానిక ఎమ్మెల్యే టీ.పద్మారావుగౌడ్ అధికారులకు సూచించారు. ఈ మేరకు అధికారులు తొలుత వ్యాయామాలకు అనుకూలంగా ఉండే పార్కుల్లో మాత్రమే ఓపెన్ జిమ్‌లకు ప్రతిపాదనలు స్థిరం చేశారు.

మేడిబావి జిమ్ బదలాయింపు

సీతాఫల్‌మండి డివిజన్ మేడిబావి మైదానంలో ఓపెన్ జిమ్ ఏర్పాటును స్థానికులు అడ్డుకున్నారు. మల్టీపర్పస్ మైదానంగా ఉన్న మేడిబావి మైదానంలో ఓపెన్ జిమ్ ఏర్పాటు అవసరం లేదని నినదించారు. ఎన్నో కార్యక్రమాలకు ఉపయోగించుకుంటున్న మైదానంలో జిమ్ నిర్మిస్తే తమను లాభం కంటే నష్టమే ఎక్కువ ఉంటుందని స్థానికులు జీహెచ్‌ఎంసీ అధికారులకు ఫిర్యాదు చేశారు. దీంతో మేడిబావిలో ఏర్పాటు చేయాల్సిన ఓపెన్ జిమ్‌ను శ్రీనివాస్‌నగర్ రెడ్‌క్రాస్ ఆసుపత్రి ప్రాంతంలోని మైదానంలో ఏర్పాటు చేయాలని తాజాగా నిర్ణయం తీసుకున్నారు.

త్వరలో ప్రారంభోత్సవాలు

జిమ్‌లు ప్రారంభం చేశాక పార్కుల్లో ఉదయం సాయంత్రం వేళల్లో పిల్లలు, పెద్దలు వ్యాయామం చేసుకునే వెసులుబాటును కల్పిస్తున్నారు. సర్కిల్ పరిధిలో చేపట్టిన ఓపెన్ జిమ్‌ల ఏర్పాట్లు 90 శాతం పూర్తయినట్టు జీహెచ్‌ఎంసీ సికింద్రాబాద్ డిప్యూటీ కమిషనర్ సుభాష్‌రావు తెలిపారు. హరితహారం కార్యక్రమాలు పూర్తయ్యాక జిమ్‌ల ప్రారంభోత్సవాలకు శ్రీకారం చుడతామన్నారు. జిమ్ పరిసర ప్రాంతాల ప్రజలు పెన్ జిమ్ సేవలు సద్వినియోగం చేసుకోవాలని డీసీ కోరారు.

డివిజన్ల వారీగా ప్రతిపాదిత పార్కులు

అడ్డగుట్ట: నందానగర్ కాలనీ పార్కు, తుకారాంగేట్ సాయినగర్ పార్కు. సమోసా గార్డెన్, శాంతినగర్ వ్యాయామశాల.
తార్నాక: నాగార్జున నగర్ పార్కు, లాలాపేట స్టేడియం.
మెట్టుగూడ: న్యూమెట్టుగూడ పార్కు, మెట్టుగూడ చిల్డ్రన్ పార్కు.
సీతాఫల్‌మండి: మధురానగర్ పార్కు, టీఆర్‌టీ కాలనీ పార్కు, మార్కండేయనగర్ పార్కు, శ్రీనివాస్‌నగర్ రెడ్‌క్రాస్ పార్కు.
బౌద్ధనగర్: ఎస్‌బీఐ కాలనీ కనకదుర్గ టెంపుల్ పార్కు, బౌద్ధనగర్ రోడ్‌నెంబర్–5 పార్కు.

ఎర్రగడ్డ రైతుబజార్‌లో కూరగాయల ధరలు

సనత్‌నగర్: టమాటా కిలోల్లో.. రూ.25, నల్లవంకాయ 35, పొడుగు వంకాయ 35, బెండకాయ 35, పచ్చిమిర్చి 50, బజ్జీమిర్చి 50, క్యాప్సికమ్ 50, పచ్చకాకర 38, పందిరి బీర 28, క్యాబేజీ 23, క్యారెట్ 35, దొండ 35, గుండుబీన్స్ 50, గింజ చిక్కుడు 65, గోకరకాయ 28, కీర 25, దోసకాయ 15, బీట్‌రూట్ 23, ఉల్లిగడ్డ 35, ఆలుగడ్డ 37, చామగడ్డ 40, మొరంగడ్డ 55, కందగడ్డ 45, సొరకాయ 13, పొట్లకాయ 18, అరటికాయ 10, మునగకాయ 4–5, ముల్లంగి 5–6. ఈ ధరలు శుక్రవారం ఉదయం 9 గంటల వరకు అందుబాటులో ఉంటాయి.

లక్ష మందితో మందకృష్ణకు ఘన స్వాగతం పలుకుతాం

లాలాపేట: మంద కృష్ణమాదిగకు ఘన స్వాగతానికి ఏర్పాట్లు లాలాపేట: ఎస్సీ వర్గీకరణపై ఇటీవల భారత అత్యున్నత న్యాయస్థానం సుప్రీం కోర్టు ఇచ్చిన తీర్పుపై మాదిగల్లో హర్షాతిరేకాలు వెల్లువెత్తుతున్నాయని ఎమ్మార్పీఎస్ సీనియర్ నాయకులు, తార్నాక డివిజన్ అధ్యక్షులు గంథమల్ల రాజలింగం తెలిపారు. గురువారం లాలాపేటలో స్థానిక ఎమ్మార్పీఎస్ నేతలు ఎర్ర నర్సింహ్మ, యాదగిరి, ఎం. ప్రభాకర్‌లతో కలిసి మాట్లాడారు. ఢిల్లీ నుంచి ఈ నెల 13 హైదరాబాద్ నగరానికి వస్తున్న ఎమ్మార్పీఎస్ అధ్యక్షులు మంద కృష్ణమాదిగకు లక్ష మంది డప్పులతో ఘనంగా స్వాగతం పలికేందుకు ఏర్పాట్లు చేస్తున్నట్లు తెలిపారు.

సీఎం రిలీఫ్ ఫండ్ చెక్కు అందజేత



లాలాపేట: పేద ప్రజలు కార్పొరేట్ వైద్యం చేయించుకోవడానికి సీఎం రిలీఫ్ ఫండ్ ఎంతగానో దోహదపడుతుందని జీహెచ్‌ఎంసీ డిప్యూటీ మేయర్ మోతే శ్రీలత శోభన్‌రెడ్డి అన్నారు. ఈ మేరకు బాధితుడు మొహమ్మద్‌కు ముఖ్యమంత్రి సహాయ నిధి నుంచి మంజూరైన రూ 60 వేల చెక్‌ను గురువారం తార్నాకలోని ఆమె కార్యాలయంలో అతనికి అందజేశారు. కార్యక్రమంలో కార్మిక సంఘం నాయకులు మోతే శోభన్‌రెడ్డి, స్థానిక నేతలు బాల్‌రాజు,నవీన్, అనీల్ తదితరులున్నారు.

గణపతి ఆలయంలో ప్రత్యేక పూజలు



సనత్‌నగర్: శ్రావణ శుద్ధ చవితి సందర్భంగా గురువారం సనత్‌నగర్ హనుమాన్ దేవస్థానం ప్రాంగణంలోని గణపతి ఆలయంలో ప్రత్యేక పూజలు నిర్వహించారు. దుర్వా గణపతి అలంకార దర్శనం భక్తులను కనువిందు చేసింది. ఈ సందర్భంగా స్వామి వారికి అష్టోత్తర శతకలశ క్షీరాభిషేకం, గరికతో సహస్రనామార్చన పూజ, అలంకరణ, హారతి, ప్రసాద వియోగం తదితర కార్యక్రమాలు జరిగాయి. ఈఓ శ్రీనివాసరాజు పర్యవేక్షణలో పూజలు కొనసాగాయి.

పోలీసులకు ప్రజాసహకారం అవసరం



అవగాహన కార్యక్రమంలో బేగంపేట పోలీసులు

సనత్‌నగర్: మాదకద్రవ్య రహిత సమాజం నెలకొల్పడంలో పోలీసులకు ప్రజల సహకారం కూడా ఎంతో అవసరమని బేగంపేట ఏసీపీ గోపాలకృష్ణమూర్తి స్పష్టంచేశారు. మాదక ద్రవ్యాలను అమ్మడమే కాదు..వాటిని వాడిన వారు కూడా శిక్షార్హులన్న విషయాన్ని ప్రజలు గుర్తించుకోవాలన్నారు. కమ్యూనిటీ పోలీసింగ్‌లో భాగంగా బేగంపేట పోలీస్‌స్టేషన్ పరిధిలోని పాటిగడ్డ, ఎన్‌బీటీనగర్, అన్నానగర్, ఓల్డ్‌కస్టమ్స్ బస్తీ, కమాన్ బస్తీ, రసూల్‌పురా, అంబేద్కర్‌నగర్ తదితర ప్రాంతాల్లో భద్రతాపరమైన వివిధ అంశాల్లో ప్రజలకు అవగాహన కల్పించారు. ఈ కార్యక్రమానికి హాజరైన ఏసీపీ గోపాలకృష్ణమూర్తి మాట్లాడుతూ చెడు అలవాట్లకు బానిసై యువత తమ ఉజ్వల భవిష్యత్తును నాశనం చేసుకోవద్దన్నారు. కార్యక్రమంలో బేగంపేట ఇన్‌స్పెక్టర్ రామయ్య, ఎస్‌ఐలు గంగాధర్, జయచందర్, నాగరాజు, శ్రీరాములు తదితరులు పాల్గొన్నారు.

‘అంబేద్కర్ అభయ హస్తం’ అమలు చేయాలి



ఎస్సీ కార్పొరేషన్ చైర్మన్ ప్రీతంను కలిసిన డీబీఎఫ్ బృందం

అడ్డగుట్ట: రాష్ట్ర ప్రభుత్వం హామీ ఇచ్చిన అంబేద్కర్ అభయ హస్తం పథకాన్ని అమలు చేయాలని కోరుతూ రాష్ట్ర ఎస్సీ కార్పొరేషన్ చైర్మన్ ప్రీతంకు డీబీఎఫ్ బృందం వినతిపత్రాన్ని సమర్పించారు. ఎస్సీ కార్పొరేషన్ నూతన చైర్మన్‌గా బాధ్యతలు చేపట్టిన ప్రీతంను దళిత బహుజన ఫ్రంట్ బృందం గురువారం మర్యాదపూర్వకంగా కలిశారు. ఈ సందర్భంగా వాళ్లు మాట్లాడుతూ కాంగ్రెస్ ప్రభుత్వం ఇచ్చిన హామీ ప్రకారం అంబేద్కర్ అభయ హస్తం పథకాన్ని వెంటనే అమలు చేయాలని, అదే విధంగా ఎస్సీ కార్పొరేషన్ స్వయం ఉపాధి ఆర్థిక మద్దతు పథకాలకు బ్యాంకు లింకేజీ తొలగించాలన్నారు. డీబీఎఫ్ వ్యవస్థాపక అధ్యక్షుడు కొరివి వినయ్‌కుమార్, జాతీయ కార్యదర్శి పీ. శంకర్, రాష్ట్ర కార్యదర్శి పులి కల్పన, ఉమ, భాస్కర్, నవీన త్రిశూల్ తదితరులు పాల్గొన్నారు.

కంటోన్మెంట్‌కు నిధులు కేటాయించాలి



చిన్నకమేళాలో బస్తీవాసులతో మాట్లాడుతున్న రామకృష్ణ

రసూల్‌పురా: రాష్ట్ర ప్రభుత్వం కంటోన్మెంట్ ప్రాంతంపై వివక్ష చూపకుండా మిగతా నియోజకవర్గాలకు కేటాయించినట్లే నిధులు కేటాయించాలని కంటోన్మెంట్ బోర్డు నామినేటెడ్ సభ్యులు రామకృష్ణ కోరారు. గురువారం బోర్డు ఏడవ వార్డు చిన్నకమేళా, టీచర్స్‌కాలనీలో బోర్డు నిధులతో చేపట్టే భూగర్భ డ్రైనేజీ పైపులైను పనులకు శంకుస్థాపన చేశారు. అనంతరం బస్తీల్లో పర్యటించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ కంటోన్మెంట్‌లో నెలకొన్న సమస్యలను పరిష్కరించేందుకు చర్యలు తీసుకుంటున్నామని అభివద్ధికి అధికంగా నిధులు కేటాయించాలని రక్షణ మంత్రిత్వ శాఖ అధికారుల దష్టికి తీసుకెళ్ళామని చెప్పారు. బోర్డు నిధులతో తాగు నీరు, రోడ్లు, భూగర్భ డ్రైనేజీ పైపులైను పనులు దశలవారీగా చేపడుతున్నామని చెప్పారు. కార్యక్రమంలో బీజేపీ నాయకులు ప్రశాంత్, శ్రీధర్ రెడ్డి, టీచర్స్ కాలనీ అధ్యక్షులు బిక్షపతిరెడ్డి స్థానికులు పాల్గొన్నారు.

దేవుడికి చెందిన పాత వస్తువులు ఇంట్లో ఉన్నాయా..!

- ఈ నెల 11న సేకరణ శిబిరం..
- రీసైక్లింగ్ విధానంలో వాటికి కొత్తరూపు..

సనత్‌నగర్: ఇళ్లల్లో పాతబడి వాడకానికి దూరమైన దేవతామూర్తుల ఫోటోలు, క్యాలెండర్లు, శిథిలమై పూజకు నోచుకోని దేవతామూర్తుల విగ్రహాలు, పూజా సామాగ్రి.. ఇలా దేవునికి చెందిన ఎటువంటి వస్తువులైనా పాతబడినప్పటికీ బయటపడేయాలంటే ఆలోచించాల్సిన పరిస్థితి. అందుకే వాటిని మూటగట్టి ఇంట్లోనే అటకెక్కించేయడం పరిపాటి. అయితే అలాంటి వస్తువులను సేకరించి రీసైక్లింగ్ విధానంతో కొత్త రూపును తీసుకువచ్చే కార్యక్రమాన్ని ఆర్య వైశ్య కమ్యూనిటీ ఇంటర్నేషనల్ (ఏవీసీఐ) సంస్థ చేపట్టింది. దీనికి సంబంధించిన వివరాలను ఏవీసీఐ సనత్‌నగర్ వాలంటీర్లు మురహరిశెట్టి సత్యనారాయణ, కొలిపాక లక్ష్మణ్‌లు వెల్లడించారు. ఇళ్లల్లోని దేవునికి చెందిన పాత వస్తువులను సేకరించేందుకు ఈ నెల 11న సనత్‌నగర్ హనుమాన్ దేవాలయ ఆవరణలో ఉదయం 8 నుంచి మధ్యాహ్నం 2 గంటల వరకు ప్రత్యేక శిబిరాన్ని ఏర్పాటుచేస్తున్నట్లు చెప్పారు. ఏవీసీఐ వ్యవస్థాపక చైర్మన్ కేఎస్ఆర్‌మూర్తి, వైస్ చైర్‌పర్సన్ శ్రీదేవి భూపాలం, కమిటీ సభ్యులు రేణుకుంట శ్రీనివాస్, తులసీగుప్తా, నాగెళ్ల కిరణ్‌గుప్తాల ఆధ్వర్యంలో ఈ కార్యక్రమం జరుగుతుందని చెప్పారు.

11, 12 తేదీల్లో బోనాల వేడుకలు

బన్సీలాల్‌పేట్: బన్సీలాల్‌పేట్ డివిజన్‌లోని పలు ప్రాంతాల్లో ఈ నెల 11,12 తేదీల్లో జరిగే బోనాల వేడుకల కోసం నిర్వాహకులు ఏర్పాట్లు చేస్తున్నారు. ఆదివారం బోనాల వేడుకలు, సోమవారం గావు, రంగం కార్యక్రమం జరగనున్నాయి. బోనాల వేడుకల కోసం ఆలయాలను అందంగా తీర్చిదిద్దారు. బన్సీలాల్‌పేట్, బోయిగూడ, బండమైసమ్మనగర్, సీసీ నగర్, ఐడీహెచ్ కాలనీ తదితర ప్రాంతాల్లో ప్రాంతాల్లో అధ్యాత్మిక శోభ సంతరించుకుంది. అలాగే బోయిగూడ నల్లపొచమ్మ, ముత్యాలమ్మ, బన్సీలాల్‌పేట్ బండమైసమ్మ, రేణుకా ఎల్లమ్మ, చాచానెహ్రూనగర్‌లోని నల్లపొచమ్మ, బోయిగూడలోని ఉప్పలమ్మ, ఐడిహెచ్ కాలనీ, గొల్లకొమురయ్య కాలనీలోని అమ్మవారి దేవాలయాలు అందంగా రూపుదిద్దుకున్నాయి. నిర్వాహకులు వెంకయ్య, బల్‌రామ్, రవికుమార్, వై. సురేష్, ప్రభాకర్, రమేష్‌లు ఏర్పాట్లు పర్యవేక్షిస్తున్నారు.

లంబాడీలకు మంత్రి పదవి ఇప్పించండి



రాహుల్‌గాంధీకి వినతి పత్రం అందజేస్తున్న శరత్‌నాయక్

ఉస్మానియా యూనివర్సిటీ: తెలంగాణ రాష్ట్రంలో లంబాడీలకు మంత్రి పదవి ఇప్పించాలని ఏఐసీసీ నేత రాహుల్‌గాంధీకి ఓయూ విద్యార్థి నేతలు వినతి పత్రం సమర్పించారు. గిరిజన శక్తి జాతీయ అధ్యక్షులు డా.వెంకటేష్ చౌవాన్, రాష్ట్ర అధ్యక్షులు శరత్‌నాయక్ ఆధ్వర్యంలో ఓయూ విద్యార్థి నేతలు పార్లమెంట్ ఆవరణలో రాహుల్ గాంధీని కలిసి రాష్ట్ర రాజకీయాలను వివరించినట్లు తెలిపారు. కార్యక్రమంలో గిరిజన శక్తి నేతలు రమేష్ రాథోడ్, నరేందర్, రాంచందర్, వినోద్, శివనాయక్ పాల్గొన్నారు.

నాలా పూడికతీత పనుల పరిశీలన



నాలా పూడికతీత పనులను పరిశీలిస్తున్న కార్పొరేటర్ ప్రసన్నలక్ష్మి

అడ్డగుట్ట: స్వచ్ఛదనం – పచ్చదనంపై ప్రజలు పూర్తి స్థాయిలో అవగాహన కల్పించే విధంగా చర్యలు తీసుకుంటున్నామని కార్పొరేటర్ ప్రసన్నలక్ష్మి అన్నారు. తుకారాంగేట్‌లో గురువారం నాలా పూడికతీత పనులు చేయించారు. ఈ సందర్భంగా కార్పొరేటర్ ప్రసన్న మాట్లాడుతూ జీహెచ్‌ఎంసీ ఆధ్వర్యంలో చేపట్టిన స్వచ్ఛదనం పచ్చదనం కార్యక్రమంలో అందరూ భాగస్వాములు కావాలని సూచించారు. కార్యక్రమంలో ఏఈ వేణు, బీఆర్‌ఎస్ నేతలు లింగాని శ్రీనివాస్, మనోహర్, సత్తయ్యగౌడ్, దాసరి శ్రీనివాస్, దేవయ్య, శ్రీరాములు, శంకర్, మహేశ్వరి, రమా పాల్గొన్నారు.

ఓయూ ఎంబీఏ డీన్‌గా ప్రొ. శ్రీరాములు

ఉస్మానియా యూనివర్సిటీ: ఓయూ ఎంబీఏ ఫ్యాకల్టీ డీన్‌గా ప్రొ.శ్రీరాములు నియమితులయ్యారు. ప్రస్తుతం కామర్స్ అండ్ బిజినెస్ మేనేజ్‌మెంట్ కాలేజీ ప్రిన్సిపల్‌గా వ్యవహరిస్తున్న ఆయన గతంలో సీడీఈ జాయింట్ డైరెక్టర్‌గా, చీఫ్ వార్డెన్‌గా, సీడీసీ డైరెక్టర్‌గా, బీవోఎస్‌గా పదవులను చేపట్టారు. డీన్‌గా పదవీ బాధ్యతలు స్వీకరించిన శ్రీరాములును పలువును సన్మానించారు.

ద్విచక్ర వాహనాల దొంగ అరెస్టు



వివరాలు వెల్లడిస్తున్న ఏసీపీ మొగలయ్య, ఇన్‌స్పెక్టర్ రాజు

బన్సీలాల్‌పేట్: పార్కు చేసిన ద్విచక్ర వాహనాలను దొంగిస్తున్న ఓ వ్యక్తిని గాంధీనగర్ పోలీసులు అరెస్టు చేశారు. గాంధీనగర్ డివిజన్ ఏసీపీ వై. మొగలయ్య, ఇన్‌స్పెక్టర్ డి. రాజు గురువారం కేసు వివరాలను వెల్లడించారు. గాంధీనగర్‌లో నివసిస్తున్న వనపర్తికి చెందిన పత్లవల్ గోపాల్ నాయక్(35).. కూలీ పనులు చేసుకొని జీవనం సాగించేవాడు. జల్సాల కోసం దొంగతనాలు చేయడం ప్రారంభించారు. పలుచోట్ల నాలుగు ద్విచక్ర వాహనాలను చోరీ చేశాడు. వాహనాలను ఓ చోట ఉంచాడని సమాచారం రావడంతో నిందితుడిని అదుపులోకి తీసుకొని విచారిస్తే ఆయా ప్రాంతాల్లో దొంగిలించిన వాహనాల వివరాలను వెల్లడించారన్నారు. క్రైమ్ ఎస్.ఐ మహ్మద్ నహీమ్ ఖాన్ ఆధ్వర్యంలోని సిబ్బంది నిందితున్ని అరెస్టు చేసినట్లు చెప్పారు. నిందితుని వద్దనున్న నాలుగు ద్విచక్ర వాహనాలను స్వాధీనం చేసుకొని కేసు నమోదు చేసి రిమాండ్‌కు తరలించినట్లు తెలియజేశారు.

చికిత్స పొందుతూ వ్యక్తి మృతి

సికింద్రాబాద్: సికింద్రాబాద్ రైల్వేస్టేషన్‌లో రైలు బోగీపైకి ఎక్కి హైటెన్షన్ ఎలక్ట్రికల్ వైర్లు పట్టుకుని తీవ్రంగా గాయపడ్డ వ్యక్తి ఆసుపత్రిలో చికిత్స పొందుతూ గురువారం మృతి చెందాడు. రైల్వే పోలీసుల కథనం ప్రకారం... తూర్పుగోదావరి జిల్లా మొక్కలతిప్పకు చెందిన వెంకటదుర్గ రామకృష్ణ (40) సూరారం కాలనీలో ఉంటూ ప్రైవేటు ఉద్యోగం చేస్తున్నాడు. రామకృష్ణకు అప్పుల భారం ఎక్కువ కావడంతో మద్యానికి బానిసయ్యాడు. జీవితంపై విరక్తి చెందిన అతడు ఈ నెల 5న రైల్వేస్టేషన్‌కు చేరుకున్నాడు. 9వ నెంబర్ ప్లాట్‌ఫామ్ పై ఆగి ఉన్న రైలుబోగీ ఎక్కి విద్యుత్ లైన్లను పట్టుకుని తీవ్రంగా గాయపడ్డాడు. చికిత్స నిమిత్తం బాధితుడిని రైల్వే పోలీసులు గాంధీ ఆసుపత్రికి తరలించారు. రెండు రోజులు చికిత్స పొందిన రామకృష్ణ మరుసటి రోజు మృతి చెందినట్టు రైల్వే పోలీసులు తెలిపారు.

గుర్తు తెలియని వ్యక్తి ఆత్మహత్య

సికింద్రాబాద్: జేమ్స్ స్ట్రీట్ రైల్వేస్టేషన్ డౌన్‌లైన్ వద్ద ఒక యువకుడు రైలుకింద పడి ఆత్మహత్య చేసుకున్నాడు. ఈ సంఘటన సికింద్రాబాద్ రైల్వే పీఎస్ పరిధిలో గురువారం చోటుచేసుకుంది. సమాచారం అందుకుని ఘటనా స్థలానికి వెళ్లిన పోలీసులకు మృతుడి వివరాలు లభించలేదు. సుమారు 24 ఏండ్ల వయసున్న యువకుడు రైలు పట్టాల కింద తలపెట్టడంతో మొండెం, తల విడిపోయాయి. ఘటన స్థలంలో లభించిన సెల్‌ఫోన్ ఆధారంగా మృతుడు కోకాపేట ప్రాంతంలో ప్రైవేటు కంపెనీ ఉద్యోగిగా గుర్తించారు.

సాక్షి
మీరు వివాహ, జన్మదిన, పదవీ విరమణ శుభాకాంక్షలు, శ్రద్ధాంజలి, వర్ధంతి, జయంతి,
వ్యాపార, ఉద్యోగ ప్రకటనలు, నోటీసులు, బహిరంగ ప్రకటనలు
మొదలగు అన్ని రకాల ప్రకటనలు సాక్షి దినపత్రిక కొరకు సంప్రదించండి.
9912220378
9912220379